క్లుప్తంగా

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

రామసముద్రం : మండలంలోని అన్ని గ్రామ సచివాలయల పరిధిలోని గ్రామాల్లో ఎండలకు, వడదెబ్బకు గురికాకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అన్ని పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది ద్వారా ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో పనిచేసే వేతన కార్మికులకు , అలాగే ప్రజలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయాలని ఎంపీడీవో భానుప్రసాద్ తెలిపారు. 6,7,8 తేదీలలో అన్ని గ్రామాల్లో ప్రజలకు ఉచితంగా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు. ప్రజలు వేసవిలో వడదెబ్బకు గురైనప్పుడి ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని తప్పకుండా సేవించాలని సూచించారు.

సమష్టిగా పని చేస్తేనే అభివృద్ధి



చెక్ అందజేస్తున్న డీఎం అమరనాథ్

మదనపల్లె సిటీ : డిపో అభివృద్ధికి అందరూ కలిసి సమష్టిగా పనిచేయాలని ఆర్టీసీ–2 డిపో మేనేజర్ అమరనాథ్ అన్నారు. మంగళవారం డిపో మెయిన్‌గేట్ వద్ద ఆదర్శ ఉద్యోగుల అభినందనసభ కార్యక్రమం నిర్వహించారు. కెఎంపిఎల్, ఈపీకె పెంచి డిపోను రీజియన్‌లో మొదటి స్థానం నిలపాలన్నారు. ప్రతిభ కనబరిచిన ఆరుగురు ఉద్యోగులకు నగదు చెక్కులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐ గీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్వోబీ నష్ట పరిహారానికి సర్వే



సీటీఎంలో నష్టపరిహారం చెల్లింపునకు సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

మదనపల్లె : మండలంలోని సీటీఎంలో ఆర్వోబీ నిర్మాణానికి సంబంధించి ఇంటి స్థలాలు కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారం చెల్లించడం కోసం మంగళవారం రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించారు. మండల సర్వేయర్ రెడ్డిశేఖర్ ఆధ్వర్యంలో విలేజ్ సర్వేయర్ సాయితేజ, ఎన్‌హెచ్ అధికారులు సంయుక్తంగా జాతీయ రహదారికి పక్కన ఉన్న 9 ఇళ్ల స్థలాలను కొలతలు వేసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ...తాము కొనుగోలు చేసిన ఇంటిస్థలానికి వేరొకరికి పరిహారం ఇచ్చేందుకు రెవెన్యూ అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సర్వేయర్ రెడ్డిశేఖర్ మాట్లాడుతూ.... ఇంటి స్థలం కొనుగోలుకు సంబంధించి డాక్యుమెంట్ ప్రకారం కొలతలు వేశామని, రోడ్డు పక్కన ఆరు అడుగుల పొడవుతో ఇంకా స్థలం మిగులుతోందన్నారు. ఈ విషయమై బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా కలెక్టర్ ఆర్బిట్రేషన్ కోర్టులో తేల్చారని, ప్రస్తుత వివాదాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళతామన్నారు. అలాగే ఇంటి స్థలం కోల్పోతున్న బాధితులకు నష్టపరిహారంకు సంబంధించి కలెక్టర్‌కు నివేదికలు పంపుతామన్నారు.

క్రైస్తవులకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలి



ఏపీ మైనారిటీ సలహాదారు ఎం.డి.షరీఫ్‌కు వినతిపత్రం అందిస్తున్న పాస్టర్.జాన్‌బాబు

మదనపల్లె : క్రిష్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ద్వారా క్రైస్తవులకు మంజూరు చేస్తున్న సబ్సిడీ రుణాల్లో పరిమితిని విధించారని, వాటి సంఖ్య పెంచి, అర్హులందరికీ అందేలా చూడాలని పట్టణ క్రిష్టియన్ టీడీపీ మైనారిటీ నాయకులు, గ్లోరీ పాస్టర్ అసోసియేషన్ అధ్యక్షులు పాస్టర్.జాన్‌బాబు కోరారు. మంగళవారం విజయవాడ టీడీపీ కేంద్రకార్యాలయంలో ఏపీ మైనారిటీశాఖ సలహాదారు, మాజీ ఎమ్మెల్సీ ఎం.డి. షరీఫ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని క్రిష్టియన్ల సమస్యలపై తెలియజేశామన్నారు. కూటమిప్రభుత్వం క్రైస్తవులకు బ్యాంక్‌ల ద్వారా మంజూరుచేస్తున్నే సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎండీ.షరీఫ్ చెప్పారన్నారు. కడపలో జరగనున్న మహానాడుకు పెద్దసంఖ్యలో క్రైస్తవ సోదరులు హాజరయ్యేలా చూడాలని కోరారన్నారు.

మూగజీవాల సేవలో ‘హెల్పింగ్’ మైండ్స్

కురబలకోట : మండలంలోని ముదివేడు ఫారెస్టులోని మూగజీవాలకు, వన్య ప్రాణులకు మదనపల్లెకు చెందిన హెల్పింగ్ మైండ్స్ బృందం మంగళవారం తాగునీటి సౌకర్యం, తిండి పదార్థాలు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబుబకర్ సిద్దిక్ మాట్లాడుతూ మండుటెండలకు మనుషులు సైతం అల్లాడుతున్నారన్నారు. ఇలాంటి పరిస్థితిలో నోరులేని మూగ జీవాలు, వన్య ప్రాణుల సంగతి చెప్పనక్కర లేదన్నారు. ప్రతి జీవికి నీరు, ఆహారం అవసరమన్నారు. వేసవిలో వీటికి అవసరమగు తాగునీటిని, తిండి పదార్థాలను అందజేసినట్లు తెలిపారు. హెల్పింగ్ మైండ్స్ సభ్యులు విశ్వనాథ్, ఆర్షియా, కిరణ్,రొష్మిక, సికిందర్, చైతు, చరణ్, రాబియా, అంజూమ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పథకంలో

కూటమి భారీ స్కాం

- టెండర్ నుంచి శిక్షణ వరకు దోపిడీ
- రూ.157 కోట్లు కొట్టేసేందుకు స్కెచ్
- ప్రజాధనం వృథా కాకుండా అడ్డుకుంటాం
- మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, మహిళా నాయకులు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు

మదనపల్లె : కూటమిప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో రోజుకో స్కామ్ జరుగుతోందని, కుట్టుమిషన్ల పథకంలో దాదాపు రూ.157 కోట్లకు పైగా కొట్టేసేందుకు ప్రభుత్వం పెద్ద స్కెచ్ వేసిందని మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ఆరోపించారు. మంగళవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కుట్టుమిషన్ల పథకంలో జరుగుతున్న అవినీతిపై మహిళా నాయకులు ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మధ్యతరగతి బీసీ మహిళలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారికి, కాపు మహిళలకు కుట్టుశిక్షణ పథకంలో మిషన్లు అందించేందుకు తొలుత రూ.100 కోట్లతో ప్రతిపాదించారన్నారు. ఆ తర్వాత ఈ పథకాన్ని రూ.257 కోట్లకు పెంచి భారీ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు...175 నియోజకవర్గాల్లో మూడు నుంచి ఐదు కేంద్రాలు ఏర్పాటుచేస్తామని, అందులో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఆ మాట చెప్పి 50 రోజులు దాటినా 50 నియోజకవర్గాల్లో కూడా ఇప్పటివరకు శిక్షణ మొదలుకాలేదన్నారు. కుట్టుమిషన్ల పేరు చెప్పి రూ.కోట్లు కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఈ పథకానికి సంబంధించి ప్రీబిడ్‌లో మొత్తం 65 కంపెనీలు పాల్గొంటే, 62 సంస్థలను ముందే తిరస్కరించారన్నారు. టెండర్‌లో పాల్గొన్న ఎల్1కు కేవలం 5 శాతం పనిమాత్రమే అప్పగించి...ఎల్2, ఎల్3కి సుమారు 95శాతాన్ని పని అప్పగించడంతో వీరి అవినీతి ఏ రకంగా ఉందో తెలుస్తోందన్నారు. గుజరాత్‌లో తక్కువ నాణ్యత కలిగిన మిషన్లను రూ.4,300కు కొనుగోలు చేశారని, ఒక మహిళకు శిక్షణ ఇచ్చేందుకు అవుట్‌సోర్సింగ్ సంస్థకు రూ.3వేలు కేటాయించారన్నారు. అంటే లక్ష మందికి రూ.7,300 చొప్పున...రూ.73 కోట్లు ఖర్చు అవుతుంటే...టెండర్ విలువ మాత్రం రూ.257 కోట్లకు చూపించి భారీ కుంభకోణానికి స్కెచ్ వేశారని విమర్శించారు. బీసీ మహిళల పేరుతో జరుగుతున్న ఈ స్కాంను ప్రజలకు వివరించి, ప్రజాధనం వృథా కాకుండా అడ్డుకుంటామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు వైజయంతి, బీరంగిరేవతి, ఎంపీటీసీ నీరుగట్టి మేరీ, వినుతాభాయి, అపర్ణ, శారదారెడ్డి తదితరులు ఉన్నారు.

మెరుగైన ఆరోగ్య సేవలందించాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉషశ్రీ

పీలేరురూరల్ : గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలందించాలి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఉషశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని రేగళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆశ డే సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సేవలు అందించడంలో ఆశ కార్యకర్తల పాత్ర కీలకమైందన్నారు. గర్భిణిగా నమోదు చేసినప్పటి నుంచి బిడ్డకు ఏడాది వయస్సు వరకు వారికి వచ్చే కిల్కారి (సేవలు) కాల్స్ అన్ని కచ్చితంగా వినేటట్లు అవగాహన కల్పించాలన్నారు. ఈ–ఆశ యాప్‌లో ఆరోగ్యసేవలు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రతి గర్భవతిని 12 వారాల లోపు నమోదు చేసుకొని ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అన్ని రకాల టీకాలు విధిగా నమోదు చేయాలని తెలిపారు. వడదెబ్బ గురించి ప్రజలకు అవగాహన కల్పించి ఓఆర్‌ఎస్ అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీప్రసన్న, సీహెచ్‌వో జయలక్ష్మీ, సూపర్‌వైజర్ రాజీమణి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలి



మాట్లాడుతున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించాలని సర్పంచ్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐదు గ్రామ సచివాలయాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాలకు వివిధ సమస్యలపై వచ్చే ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలన్నారు. సైబర్ మోసాలపై ఉద్యోగులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సెలఫోన్‌లోకు వచ్చే ఆకర్షణీయమైన యాప్‌లు, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధిలైట్లు, డ్రైనేజీ పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో ఈవో గురుమోహన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నౌషాద్, వార్డు మెంబర్లు మల్లికార్జునరెడ్డి, విక్టరీ వెంకటరమణారెడ్డి, అబీద్, శ్రీనాథరెడ్డి, సాంబశివారెడ్డి, కాలేషా, నాగభూషణం, సచిన్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉలవల గంగమ్మ జాతర



భక్తులతో కిక్కిరిసిన ఉలవల గంగమ్మ ఆలయం

పీలేరు రూరల్ : మండలంలోని తలపుల పంచాయతీలో శ్రీ ఉలవల గంగమ్మ జాతర మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి భజనలు, చాందినీ బండ్లు, కోలాటాలు నిర్వహించారు. భక్తులు చాందిని బండ్లు ఊరేగింపుగా తీసుకెళ్లి ఆలయ ప్రదక్షిణలు నిర్వహించారు. మంగళవారం ఉదయం భక్తులచే బోనాల సమర్పణ, మొక్కు చెల్లింపు చేపట్టారు. పీలేరు తోపాటు కేవీపల్లె, రొంపిచెర్ల, యర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కార్యనిర్వాహకులు వెంకటరమణనాయుడు, మల్లికార్జుననాయుడు, సాగర్‌రెడ్డి, హరినాథనాయుడు, మల్లయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ముదివేడు రిజర్వాయర్ నిర్వాసితులకు

పరిహారం చెల్లించాలి

విజయవాడ సీసీఎల్‌ఏ ఎదుట
నేడు రైతుల ధర్నా



నిర్వాసితులతో కలసి మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు

మదనపల్లె : ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట బుధవారం రైతులు ధర్నా నిర్వహించనున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మదనపల్లె రోడ్ రైల్వేస్టేషన్ నుంచి విజయవాడకు రైతులు వెళుతున్న సందర్భంగా పి.శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. ముదివేడు రిజర్వాయర్ నిర్మాణం కోసం బి.కొత్తకోట మండలంలోని కోటావూరు, కురబలకోట, ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలోని 765 ఎకరాల భూమిని సేకరించారన్నారు. దీనికి సంబంధించి దాదాపు 300 మంది రైతులు నిర్వాసితులయ్యారని, దిగువసీతివారిపల్లె, కొత్తపల్లె, చౌటకుంటపల్లె, దిన్నెమీదపల్లె గ్రామాలు పూర్తిగా మునిగిపోతున్నా...ఇప్పటివరకు పునరావాసం కానీ నష్టపరిహారం కానీ చెల్లించలేదన్నారు. కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీపీఎం ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగా రూ.107.46 కోట్లు చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దాదాపు 300 మంది రైతులకు నష్టపరిహారం రూ.7 కోట్లు రావాల్సి ఉండగా, కేవలం 22మంది రైతులకు 1.65 కోట్ల నష్టపరిహారం కూటమిప్రభుత్వం విడుదల చేయడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో నిర్వాసిత రైతులు రాజేష్, శ్రీనివాసులు, గంగరాజు, రెడ్డెప్ప, లక్ష్మీదేవి, రమణమ్మ, గణేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల

పీలేరు : కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ యర్రకొండక్కగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు సుధాకర్‌రెడ్డి కుమారుడు అరుణ్‌కుమార్‌రెడ్డికి లతశ్రీతో స్థానిక ఎంఎం కల్యాణ మండపంలో వివాహం జరిగింది. ఈ వివాహానికి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ఆశీర్వదించారు. అలాగే మాజీ ఎమ్మెల్యే మండలంలోని తలపులలో ఇటీవల వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యంశెట్టి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. కావలిపల్లెలో ఉపాధ్యాయుడు నందకుమార్ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, సర్పంచ్‌లు హబీబ్‌బాషా, దండు జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు మల్లికార్జునరెడ్డి, ఉదయ్‌కుమార్, చక్రధర్, ఆనంద్, భువన, షాకీర్, మునీర్, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం మండలంలో పలువురిని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మంగళవారం పరామర్శించారు. మండల పరిధిలోని మూరేవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు యర్తా కేశవరెడ్డి భార్య లక్ష్మీదేవమ్మ ఇటీవల మరణించారు. సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మూరేవాండ్లపల్లికి చేరుకుని కేశవరెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, లక్ష్మీదేవమ్మ చిత్రపటానికి నివాళులు అర్పించారు. అలాగే ఇదే గ్రామానికి చెందిన పెద్ద రెడ్డెప్పరెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష వితరణ

కలకడ : మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీలో వెలసిన శ్రీకోటమిట్ట ఆంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి యల్లంకివారిపల్లె గ్రామానికి చెందిన యల్లంకి సుధాకరనాయుడు రూ.లక్ష వితరణ చేసినట్లు భానుప్రకాష్‌నాయుడు మంగళవారం తెలిపారు. ఆ నగదుతో ఆలయ అభివృద్ధి, రంగులు వేయాలని కమిటీ సభ్యులను దాత సుధాకరనాయుడు కోరినట్లు తెలిపారు. మరింత మంది దాతలు ముందుకు వచ్చి ఆలయాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.

విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికే శిబిరాలు

మదనపల్లె సిటీ : విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడానికే ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయ అధికారిణి వసంతకుమారి అన్నారు. మంగళవారం శిక్షణ శిబిరాలను పరిశీలించారు. ఏప్రిల్ 28వతేదీన ప్రారంభమైన శిబిరానికి మంచి స్పందన లభిస్తోందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు రెడ్డెప్ప స్పోకెన్ ఇంగ్లీషు, మానవతా విలువలు మదన్, కృష్ణమూర్తి మ్యాథ్స్, చంద్రకళ డ్రాయింగ్,బయాలజీ, రమణమ్మభగవద్గీత అంశాలను నేర్పించనున్నట్లు తెలిపారు. శిబిరంకు హాజరయ్యే విద్యార్థులకు స్నాక్స్ అందిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను వేసవి శిక్షణా శిబిరంకు పంపాలని ఆమె కోరారు.

9న మండల సర్వసభ్య సమావేశం

కలికిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న శుక్రవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ నూర్జహాన్ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భానుమూర్తిరావు తెలిపారు. సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు తగిన సమాచారంతో హాజరవ్వాలని కోరారు. అలాగే ప్రజాప్రతినిధులు హాజర్వాలన్నారు.

ఉపాధి సిబ్బందికి జీతాలు అందక కష్టాలు

పెద్దతిప్పసముద్రం : జాతీయ ఉపాధి హామీ కార్యాలయాల్లో పని చేస్తున్న సిబ్బందికి జీతాలందక సతమతమైపోతున్నారు. గత రెండు నెలల నుంచి జీతాలందక పోవడంతో పాటు మూడో నెల గడుస్తున్నా తమ గోడును ఎవరూ పట్టించుకున్నా పాపాన పోలేదని పలువురు అసహనం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు 504 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 130, ఏపీవోలు 30, కంప్యూటర్ ఆపరేటర్లు 80, ఈసీలు 30 మంది దాకా పని చేస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారులైతే ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, కూలీల సంఖ్య పెంచాలని ఇలా హుకుం జారీ చేస్తుంటే తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని పలువురు వాపోతున్నారు. జీతాల మంజూరు విషయంలో మాత్రం మాలాంటి చిరుద్యోగుల గోడు పట్టించుకోవడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారని పలువురు సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం ఇప్పటికైనా జీతాల మంజూరుకు ప్రభుత్వం చొరవ చూపాలని సిబ్బంది కోరుతున్నారు.

ఉచిత వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ పసుపులేటి చలపతి తదితరులు

మదనపల్లె : మండలంలోని పొన్నూటిపాలెం పంచాయతీ చిప్పిలిలో, కురవంక వైఎస్సార్ సీపీ సర్పంచ్ పసుపులేటి చలపతి ఆధ్వర్యంలో సత్సంగ్ ఫౌండేషన్, స్వాస్థ ఆస్పత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో ఆర్థో, జనరల్, కిడ్నీ, మెటర్నటీ, షుగర్, బీపీ వ్యాధులకు సంబంధించి స్వాస్థ ఆస్పత్రి వైద్యులు...రోగులను పరీక్షించి మందులను అందజేశారు. శిబిరానికి సుమారు 400 మందికి పైగా ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా చిప్పిలి గ్రామస్తులు.. గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్యశిబిరం ఏర్పాటుచేసినందుకు సర్పంచ్ పసుపులేటి చలపతి, యువనాయకులు శశికుమార్‌ను సత్సంగ్ ఫౌండేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో బీవైఎస్ పునీత్, మోహన్‌రెడ్డి, రైల్వే రామిరెడ్డి, హరి, వరప్రసాద్, డాక్టర్లు కృష్ణతేజ, శిల్ప, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీలను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న బీసీ సెల్ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్

కలికిరి(వాల్మీకిపురం) : బీసీలను కూటమి ప్రభుత్వం దగా చేస్తోందని పీలేరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షుడు నీళ్ల భాస్కర్ విమర్శించారు. వాల్మీకిపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో స్థానిక నాయకులతో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. బీసీల పేరుతో పక్కా ప్రణాళికతో కోట్లాది రూపాయలు దండుకోవడానికి కూటమి ప్రభుత్వం కుట్రకు తెరలేపిందని ఆరోపించారు. కుట్టు యంత్రాల పంపిణీ, టైలరింగ్ శిక్షణకు ఒకొక్కరికి కూటమి ప్రభుత్వం రూ.23వేలు కేటాయించిందన్నారు. అయితే ప్రభుత్వం కుట్టు మిషన్‌కు రూ.4300, కాంట్రాక్ట్ ఔట్ పోస్టుకు రూ.3వేలు, మొత్తం రూ.7300 వంతున లక్ష మందికి రూ.73 కోట్లు మాత్రమే కాగా ఆర్డర్ కాస్ట్ రూ.230 కోట్లు ఖర్చుచేస్తున్నట్లు చూపడం దారుణమన్నారు. బీసీల పేరుతో ప్రభుత్వం అక్షరాలా రూ.167 కోట్లు రూపాయలు లూటీ చేయడానికి ప్రభుత్వం తెరలేపిందన్నారు. బీసీల ఓట్లతో గద్దెనెక్కిన ప్రభుత్వం ఈ రోజు అక్రమార్జన కోసం అదే బీసీలను మోసగించడం చూస్తున్నామన్నారు. దోచుకుని దాచుకోవడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా బీసీలు ఏకమై కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి బుగ్గ ఆనంద, మండల పార్టీ కన్వీనర్ పులి శివారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మహేష్, నాయకులు శివ, రాజాబాబు, గాందీపేట రఘు, బిడ్డల కేశవరెడ్డి, ముని భాస్కర, చంద్రశేఖర్, విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల కష్టాలు పట్టించుకోండి

- జాక్‌పాట్‌పై చర్యలు తీసుకోరా?
- మార్కెట్ కమిటీ కార్యదర్శిపై రైతుల ఆగ్రహం



మార్కెట్ కమిటీ కార్యదర్శికి ఫిర్యాదు చేస్తున్న టమాటా రైతులు

గుర్రంకొండ : కార్యాలయంలో కూర్చొని వెళ్లడం కాదు.. ఒక్కసారి టమాటా మండిల్లోకి వచ్చి రైతుల కష్టాలు చూడడండి, జాక్‌పాట్‌పై ఎన్నిమార్లు అర్జీలు ఇచ్చినా చర్యలు తీసుకోరా అంటూ మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డిపై మంగళవారం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మార్కెట్‌యార్డు కార్యాలయంలో వాల్మీకిపురం మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డి ఉన్నాడనే విషయం తెలుసుకొన్న రైతులు ఓవైపు మండీల్లో టమాటాల వేలం పాటలు జరుగుతూన్నా కార్యాలయం వద్దకు చేరుకొన్నారు. అక్కడే ఉన్న కార్యదర్శిని సమస్యలపై నిలదీసి ప్రశ్నించారు. వ్యాపారులు వందక్రేట్లకు 20నుంచి 22 క్రేట్లు జాక్‌పాట్ రూపంలో తమను దోచుకొంటున్నారు. ఎన్నిమార్లు సమస్యలపై అర్జీలు ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారుల ఆగడాలు భరించలేకున్నామని రైతులు ఫిర్యాదు చేశారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ జాక్‌పాట్ పేరుతో రైతులను దోచుకొంటున్న వ్యాపారులకు గతంలో పలుమార్లు నోటీసులు ఇచ్చామన్నారు. రెండుమూడు రోజుల్లో వ్యాపారులతో జాక్‌పాట్ విషయమై సమావేశం నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

డీఎస్పీ మహేంద్ర



మదనపల్లె : డివిజన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ మహేంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... డివిజన్‌లోని మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, ముదివేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి బి.కొత్తకోట పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకటి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు మొత్తంగా ఎనిమిది చోట్ల బ్లాక్ స్పాట్లు గుర్తించామన్నారు. ప్రమాదాల నివారణకు 360 డిగ్రీల కోణంలో పనిచేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. వాహనదారులకు అనుకూలంగా సైన్ బోర్డులు రేడియం స్టిక్కర్లు వేస్తామన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలన్నారు. వాహనంతో రోడ్డుపైకి వచ్చే ప్రతి ఒక్కరు సంబంధిత ధ్రువపత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. హెల్మె ట్లు లేకపోయినా, మైనర్లు వాహనాలు నడిపినా, ఆటోలు అధిక లోడుతో ప్రయాణించిన కేసులు నమోదు చేస్తామన్నారు. వేసవికాలంతోపాటు పాఠశాలలకు సెలవులు ఇచ్చిన నేపథ్యంలో పిల్లలు చెరువులు బావులు వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. సెలవులు కారణంగా ప్రజలు ఇతర ప్రాంతాలకు పర్యటనలకు వెళతారని, వెళ్లేవారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలన్నారు.

ధ్వజారోహణం.. దేవతాహ్వానం



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు



సూర్యప్రభ వాహనంపై వెంకన్న

- సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజపటావిష్కరణ
- సూర్య,చంద్రప్రభ వాహనాలపై విహరించిన వెంకన్న

మదనపల్లె సిటీ : సత్యలోకానికి సంకేతంగా కోటి సూర్యతేజస్సుతో వెలిగిపోయే గరుడ ఆళ్వార్లను మంత్రపూర్వకంగా ఆహ్వానించే ధ్వజారోహణం.. తనువు, మనసు పులకించిపోతుండగా దేవదేవుడి వాహనమైన గరుత్మంతుని ద్వారా దేవతలను ఆహ్వానించే దేవతాహ్వానం..భేరీపూజలను మంగళవారం స్థానిక దేవళం వీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమం ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా నిర్వహించారు.బ్రహ్మోత్సవాలకు సకలదేవతలను ఆహ్వానిస్తూ గరుత్మంతుని చిత్రపటావిష్కరణ చేశారు. అంతకుముందు ఉత్సవ మూర్తులైన శ్రీదేవి,భూదేవి సమేత వెంకటరమణస్వామిని పంచామృతాలతో అభిషేకించి పట్టుపీతాంబరాలతో సర్వాంగ సుందరంగా అలకరించారు.

సూర్య,చంద్రప్రభ వాహనంపై వెంకన్న: బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్థానిక రెడ్డప్పనాయుడు కాలనీ ఉభయదారులుగా కాలనీ నుంచి వెంకన్న ఉభయ దేవేరులతో సూర్యప్రభ వాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. రాత్రి ఈశ్వరమ్మకాలనీ వాసులు ఉభయదారులుగా చంద్రప్రభవాహనంపై కొలువైన వెంకన్న పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, ఆలయ ఇన్‌స్పెక్టర్ శశికుమార్, మాజీ చైర్మన్ బింగి పాండు, మాజీ సభ్యులు ప్రసాద్‌రెడ్డి, గంగారపు భాస్కర్‌రెడ్డి, బింగి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలిచెర్ల ఉరుసు ఉత్సవాలకు ఆహ్వానం



కలిచెర్ల ఉరుసు ఉత్సవాల ఆహ్వానపత్రికను నిసార్‌అహ్మద్‌కు అందిస్తున్న కమిటీ సభ్యులు

మదనపల్లె : పెద్దమండ్యం మండలం కలిచెర్ల మౌలాకా పహాడ్ ఉరుసు, గంధం మహోత్సవానికి హాజరుకావాల్సిందిగా వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డికి ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. మంగళవారం వైఎస్సార్ సీపీ కార్యాలయానికి విచ్చేసిన ఉరుసు ఉత్సవ కమిటీ సభ్యులు నిసార్‌అహ్మద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డికి ఆహ్వానపత్రికను అందజేశారు. కడప పెద్దదర్గా పీఠాధిపతి సయ్యద్ ఆరీఫుల్లాసాహెబ్ హుస్సేని ఆధ్వర్యంలో మే 8న నిర్వహించే గంధం మహోత్సవానికి హాజరవ్వాలని కోరారు. ఉరుసు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్, ఉత్సవ ఆహ్వాన కమిటీ సభ్యుల ఆహ్వానాన్ని మన్నిస్తూ తప్పక హాజరవుతానని చెప్పారు.